గన్నేరువరం: పారువెల్లలో కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతున్న నాయకులు

శంకరపట్నం: ఎరడపల్లిలో రసమయికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంకరపట్నం: కాచాపూర్‌లో రసమయికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

గడప గడపకూ బీఆర్ఎస్

గ్రామాల్లో జోరందుకున్న గులాబీ పార్టీ ప్రచారం • పథకాలు వివరిస్తూ ప్రజలను ఓటు అభ్యర్థించిన నాయకులు, కార్యకర్తలు

తిమ్మాపూర్: నుస్తులాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ తదితరులు

తిమ్మాపూర్, నవంబర్ 25: మానకొండూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ప్రచారం జోరందుకున్నది. ఇందులో భాగంగా శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి, బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నుస్తులాపూర్ గ్రామంలో, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఇతర పార్టీలకు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో..

గన్నేరువరం నవంబర్ 25: మండలంలోని పారువెల్ల, ఖాసీంపేట, గన్నేరువరం, జంగపల్లి, గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తరపున నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని, మ్యానిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఎన్నికల్లో మరోసారి పార్టీని ఆదరించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మూడోసారి గెలిపించి, ముఖ్యమంత్రి నాయకత్వాన్ని బలపరచాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఆంజనేయులు, ప్రభాకర్, రాములు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నంలో..

శంకరపట్నం, నవంబర్ 25: గ్రామాల్లో మరింతగా అభివృద్ధి జరుగాలంటే బీఆర్ఎస్ గెలిచి తిరిగి అధికారంలోకి రావాలని పార్టీ మండల నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కేశవపట్నం, ఎరడపల్లి, మెట్‌పల్లి, ఆముదాలపల్లి, లింగాపూర్, మక్త, తాడికల్, ముత్తారం, తదితర గ్రామాల్లో మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా తిరిగి మరోసారి రసమయిని గెలిపిస్తే నియోజకవర్గంలో దళితులు అందరికీ దళిబంధు అమలవుతుందని స్వయంగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దళితుల ఓట్లు చీలకుండా బీఆర్ఎస్‌కే వేయాలని కోరారు. ఇతర పార్టీల మాటలు నమ్మవద్దని హితవు పలికారు. ఇప్పటికే గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. ఎమ్మెల్యే రసమయితోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి డాక్టర్ రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కరపత్రాలు పంచిపెట్టారు. ఈవీఎంలలో ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రచారంలో ఎంపీటీసీల ఫోరం చైర్మన్ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, సర్పంచులు, కోండ్ర రాజయ్య, దాసారపు భద్రయ్య, రంజిత్‌రావు, మానస, బీఆర్ఎస్ నాయకులు వంగల కిషన్‌రెడ్డి, నెలవేని మహేశ్, పంజాల రాజయ్య, బుద్ధార్థి సంపత్, కొయ్యడ కుమార్, అంతం కృష్ణారెడ్డి, పడాల సత్యనారాయణ, సయ్యద్ అబ్జల్, రమేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో

ఇల్లంతకుంట, నవంబర్ 25 : మండలంలోని పెద్దలింగాపూర్, కందికట్కూర్, జవారుపేటలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేసి మానకొండూర్ ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెద్దలింగాపూర్‌లో పొలం పనులు చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అన్నాడి అనంత రెడ్డి, సర్పంచ్ గొడిసెల జితేందర్ గౌడ్, ముత్యం అమర్ గౌడ్, నాయకులు మీసర గండ్ల అనిల్, బొప్ప శ్రీనివాస్, నాగరాజు, విప్లవ్, కిషన్‌రెడ్డి, బాగయ్య, సుధాకర్ రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: లింగాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్ వీరస్వామి, నాయకులు

ఇల్లంతకుంట : పెద్దలింగాపూర్‌లో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న సర్పంచ్, నాయకులు

నేదునూర్‌లో ఇల్లు దగ్ధం

తిమ్మాపూర్, నవంబర్ 25: ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని నేదునూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎలగందుల సలవ్వ, ఆమె కొడుకు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సలవ్వ భర్త మొండయ్య గతంలోనే చనిపోయాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో తల్లి కొడుకులు ఇంట్లో ఉండగా ప్రమాదవశాత్తు మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు సర్పంచ్ వడ్లూరు శంకర్ తెలిపారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న వారి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునేలా కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 25: మండలంలోని నేదునూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి, స్కూల్ లీడర్‌ను ఎన్నుకున్నారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎన్నికల్లో పదో తరగతి విద్యార్థి మద్దూరి శ్రీ చరణ్ ఎన్నికయ్యాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మానకొండూర్, నవంబర్ 25: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని మద్దికుంట గ్రామానికి 20 మంది యువకులు శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరారు. కాగా, ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పాటుపడాలని వారికి జీవీఆర్ సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, మానకొండూర్ సింగిల్ విండో చైర్మన్ నల్ల గోవిందరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రామంచ గోపాల్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన మద్దికుంట గ్రామానికి చెందిన యువకులు

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఇందుర్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

చిగురుమామిడి, నవంబర్ 25: మండలంలోని ఇందుర్తి గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అబ్జర్వార్ సోనీ ఫెన్సింగ్ భాటియా శనివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. వీరి వెంట ఎస్సై రాజేశ్, రెవెన్యూ అధికారులు, తదితరులున్నారు.

'ఆనంద వైభవ పర్తి యాత్రను విజయవంతం చేయాలి'

తెలంగాణచౌక్, నవంబర్ 25: పుట్టపర్తిలోని భగవాన్ శ్రీసత్యసాయి ఆశ్రమంలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి నిర్వహించే శ్రీసత్యసాయి ఆనంద వైభవ పర్తి యాత్రను విజయవంతం చేయాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాలైపు లింగమూర్తి శనివారం ఒక ప్రకటనలో కోరారు. వైభవ పర్తి యాత్రలో పాల్గొనే భక్తులు శర్మనగర్‌లోని పుట్టపర్తి బాబా అలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు.